అన్ని రంగాల్లో విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దుతా

పీయూ ఉప కులపతి డా.జీఎన్ శ్రీనివాస్



వీసీ డా.జీఎన్ శ్రీనివాస్‌కు మొక్క అందిస్తున్న రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి, ఆచార్యులు

పాలమూరు, న్యూస్‌టుడే : పాలమూరు విశ్వవిద్యాలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఉపకులపతి (వీసీ) డా.జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన విశ్వవిద్యాలయానికి రాగా రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి, ఆచార్యులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీయూకు తాను ఉపకులపతిగా రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. 29 ఏళ్ల నుంచి తాను బోధనా రంగంలోనే ఉన్నానని, విశ్వవిద్యాలయాన్ని ఎలా అభివృద్ధి చేయాలో తనకు తెలుసని పేర్కొన్నారు. ఎక్కువ మంది గ్రామీణ విద్యార్థులే ఉంటారని, వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. విద్యతోపాటు సహపాఠ్య అంశాలు, పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయటంపై దృష్టిసారిస్తామని తెలిపారు. వచ్చే ఏడాది న్యాయ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాలలను ప్రారంభిస్తామన్నారు. పీయూ అభివృద్ధికి ప్రభుత్వ, తాత్కాలిక, పొరుగు సేవలు, ఒప్పంద ఉద్యోగుల సహకరించాలని, ఎలాంటి సమస్య ఉన్నా.. నేరుగా తన వద్దకు రావచ్చని తెలిపారు. పరీక్షల నియంత్రణ అధికారి రాజ్‌కుమార్, అధికారులు విజయలక్ష్మి, శాంతిప్రియ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ప్రవీణ, ప్రిన్సిపల్స్ చంద్రకిరణ్, నూర్జహాన్, బషీర్ అహ్మద్, వెంకట్‌రెడ్డి, భగవంతురెడ్డి, భాస్కర్, జైపాల్‌రెడ్డి, కుమారస్వామి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యానికి భరోసా

ఆర్బీఎస్‌కే ద్వారా విద్యార్థులకు వైద్యసేవలు



మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

న్యూస్‌టుడే, పాలమూరు : ప్రభుత్వ పాఠశాలల్లో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్‌కే) అండగా నిలుస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లాలో 7, నాగర్‌కర్నూల్‌లో 10, నారాయణపేటలో 5, వనపర్తిలో 8, జోగులాంబ గద్వాల జిల్లాలో 5 చొప్పున మొత్తం 35 ఆర్బీఎస్‌కే వైద్య బృందాలు పని చేస్తున్నాయి. ప్రతి బృందంలో ఇద్దరు వైద్యులు (ఆడ, మగ), ఒక ఫార్మసిస్టు, ఏఎన్ఎం ఉంటారు. వారికి వాహన సౌకర్యం కూడా ఉంటుంది. బృందాల సభ్యులు వారంలో ఐదు రోజులు ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి సమీపంలోని ఆసుపత్రులకు సిఫారసు చేస్తున్నారు.

రక్తహీనత బాధితులే ఎక్కువ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 1,48,556 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అందులో అనేక రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 6,143 మంది చిన్నారులను గుర్తించారు. వారిని మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆర్బీఎస్‌కే ఆధ్వర్యంలో నిర్వహించే డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్(డైక్)కు పంపించారు. వివిధ విభాగాలకు చెందిన 13 మంది వైద్యులు అవసరమైన చికిత్సలు అందిస్తున్నారు. చిన్నారుల్లో తీవ్ర రక్తహీనత, దంత సంబంధ సమస్యలు, పోషకాహారలోపం ఎదుర్కొంటున్నవారు ఎక్కువ మంది ఉన్నారు.

బాలల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి : మా వైద్య బృందాలు రోజూ పాఠశాలలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ప్రతి శనివారం అనారోగ్య బాధితుల వివరాలు మాకు సమర్పిస్తారు. చిన్నారులను కూడా మహబూబ్‌నగర్‌కు తీసుకొస్తారు. వారి అనారోగ్య సమస్యలు పూర్తిగా నయమయ్యే వరకు మెరుగైన చికిత్సలు అందిస్తాం. ప్రత్యేకంగా దృష్టిసారిస్తాం.

- దేవీదాసు, ఆర్బీఎస్‌కే మేనేజర్, మహబూబ్‌నగర్ జిల్లా


చిన్నారుల అనారోగ్య సమస్యలివే..

అనారోగ్య సమస్య	బాధితులు
తీవ్ర రక్తహీనత	692
దంత సమస్యలు	682
పోషకాహారలోపం	386
దృష్టిలోపం	156
మాట్లాడలేకపోవడం	156
రుతుచక్ర సమస్యలు	151
నరాలు, ఎముకలు	145
బుద్ధి మాంద్యం	51
ప్రవర్తన సమస్యలు	39
గుండె సమస్యలు	32
అభ్యసన వైకల్యాలు	26
నిరాసక్తత	18
గ్రహణ మొర్రి	14
రక్తమార్పిడి	07
వంకర కాళ్లు	06
కర్ణభేరి సమస్యలు	02

దుమ్ములో రాకపోకలెలా?



బస్సు వెళ్తుండగా లేచిన దుమ్ముతో ద్విచక్రవాహనదారుడి ఇబ్బందులు



కంకర తేలి అధ్వానంగా మారిన రహదారి

మహబూబ్‌నగర్ పట్టణం పాత పాలమూరు వద్ద కల్వర్టు నిర్మాణాన్ని మరింత విస్తరిస్తున్నారు. కల్వర్టుకు రెండు వైపులా కంకర తేలి, దుమ్ము లేస్తున్న రహదారి ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తోంది. రద్దీగా ఉండే రహదారి కావడంతో రోజూ వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. గుత్తేదారు పనులు జరుగుతున్న ప్రదేశంలో నీటిని చల్లకపోవడంతో భారీ వాహనాలు వెళ్తున్నప్పుడు దుమ్ము లేచి పాదచారులు, ద్విచక్రవాహనదారులు, సమీపంలోని దుకాణాల వాళ్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

– ఈనాడు, మహబూబ్‌నగర్

అక్రమాల దస్త్రం

మరుగున పడినట్లేనా?




లబ్ధిదారులకు పంపిణీ చేసిన గొర్రెలు

ధరూరు న్యూస్‌టుడే: గొర్రెల పంపిణీపై గత కొన్ని నెలల క్రితం ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో అక్రమార్కుల్లో ఆందోళన మొదలైంది. నెలలు గడుస్తున్న కొద్దీ అక్రమాలపై విచారణ ఊసే కనిపించటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నది. రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో మరో ముగ్గురు అధికారుల అరెస్టులు తప్ప పెద్దగా విచారణలో పురోగతి కనిపించడం లేదు. ఈ పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లాలో రీసైక్లింగ్ ద్వారా పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. అధికారులతోపాటు కొందరు గొర్రెల పంపెకందారుల సంఘం అధ్యక్షుల పాత్ర కూడా ఈ అవకతవకల్లో ఉందన్నది స్పష్టం. కాని క్షేత్ర స్థాయిలో దీనిపై ఎలాంటి విచారణ చేపట్టడం లేదు. దీంతో అక్రమార్కులపై చర్యలు ఉంటాయో? లేదోనన్న? అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయి.

కాగ్ గుర్తించిన అంశాలు..

గొర్రెల పంపిణీలో జరిగిన అనేక అక్రమాలను కాగ్ గుర్తించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 70,688 యూనిట్లు పంపిణీ చేశారు. దీని కోసం ప్రభుత్వ నిధులు రెండు విడుతల్లో రూ.730 కోట్ల వరకు ఖర్చు చేశారు. కాగ్ పరిశీలనలో మహబుబ్‌నగర్ జిల్లాలో 108 గొర్రెలను ఒక కారులో తరలించినట్లుగా రికార్డుల్లో పొందుపరిచినట్లు గుర్తించింది. ఇక్కడ రవాణా వాహనం డీసీఎం నంబరు బదులు కారు నంబరు నమోదు చేశారు.

- ఒకే సమయంలో ఒకే వాహనంలో వేర్వేరు ప్రాంతాల నుంచి గొర్రెలు తరలించినట్లు రికార్డుల్లో నమోదై ఉంది. శ్రీకాకుళం, కడప, కర్ణాటకలోని పలు ప్రాంతాల నుంచి కూడా ఇదే వాహనంలో తరలించినట్లు రికార్డుల్లో ఉంది.
- ధన్వాడ మండలానికి వచ్చిన గొర్రెల్ని సక్రమంగా లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో అప్పట్లో ఓ అధికారిని సస్పెండ్ చేశారు. గద్వాల జిల్లాలో అధికారులు అనంతపురం వెళ్లి ఏజెంట్ల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు ఫిర్యాదులున్నాయి. నాడు అక్కడ పని చేసిన ఏడీ డబ్బు పంపిణీ వ్యవహారంలో గొడవకు దిగినట్లు ఆరోపణలొచ్చాయి.
- పలు నియోజకవర్గాల పరిధిలో విజిలెన్స్ విచారణలో బయటపడిన వాస్తవాలు అందరినీ విస్మయాలనికి గురి చేశాయి. చాలాచోట్ల యూనిట్లే కనిపించని దాన్ని విచారణలో గుర్తించారు. నాగర్ కర్నూల్ జిల్లా మాచర్ల కేంద్రంగా పెద్ద ఎత్తున రీసైక్లింగ్ జరిగినట్లు ఆరోపణలొచ్చాయి.



- వనపర్తి జిల్లాలో కొత్తకోట, మదనాపురం మండలాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. జడ్చర్ల, మానవపాడు ఠాణాల్లో గొర్రెల రీసైక్లింగ్‌కు పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదయ్యాయి. అప్పట్లో క్షేత్రస్థాయిలో పూర్తి విచారణ చేసి నివేదికలు ఇవ్వాల్సిందిగా జిల్లా అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. కానీ ఇప్పటి వరకు నివేదికల ఆధారంగా క్షేత్రస్థాయిలో విచారణగానీ అక్రమార్కులపై చర్యలుగానీ లేవు. అసలు పంపిణీలో అక్రమాలపై విచారణ జరుగుతుందా? దస్త్రం మూసేస్తారా? అన్నదానిపై మాకే స్పష్టత లేదని ఉమ్మడి జిల్లాలో పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ పశువైద్యాధికారి చెప్పుకొచ్చారు.

రెండు విడతల్లో పంపిణీ చేసిన గొర్రెలు: మహబూబ్‌నగర్ 16,721 | నాగర్‌కర్నూల్ 19,127 | వనపర్తి 14,511 | గద్వాల 10,525 | నారాయణపేట 9,804

ఆయిల్‌పాం పంట సాగుకు ప్రోత్సాహం : కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఆయిల్‌పాం తోటలు సాగుకు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉద్యాన శాఖ అధికారులతో సమీక్షించారు. వంట నూనెలను భారత్ మలేషియా, ఇండోనేషియా వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోందని, ఇక్కడే పండిస్తే భారీగా డిమాండ్ ఉంటుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 2,500 ఎకరాల్లో ఆయిల్‌పాం తోటల పెంపకం లక్ష్యంగా నిర్దేశించగా 662 ఎకరాల్లో పరిపాలన అనుమతులు మంజూరు చేసి 313 ఎకరాల్లో మొక్కలు నాటారని వివరించారు. లాభదాయక పంట ఆయిల్‌పాం వైపు రైతులను ప్రోత్సహించాలని, వారికి అందించే రాయితీలను వివరించాలన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి వేణుగోపాల్, వ్యవసాయ అధికారి వెంకటేశ్, ప్రీయూనిక్ ఆయిల్ పాం కంపెనీ డిప్యూటీ మేనేజర్ మల్లేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రైతేరాజు 6 లో..

పోలీసు అమరవీరుల స్ఫూర్తితో విధులు

జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్



అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగుదామని జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. ఈ మేరకు సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఫ్లాగ్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం కవాతు మైదానంలో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలో మావోయిస్టుల ప్రాబల్యం తీవ్రంగా ఉన్నా పోలీసులు ఎంతో ధైర్యంగా విధులు నిర్వహించారని గుర్తుచేశారు. పోలీసుల ప్రాణత్యాగాలు మరవలేనివన్నారు. అమరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎప్పటికీ అండగా ఉంటుందని, సంక్షేమానికి అన్ని విధాలా కృషి చేస్తుందని తెలిపారు. ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ గతేడాది నుంచి ఇప్పటివరకు దేశ వ్యాప్తంగా 214 మంది పోలీసు అధికారులు అమరులయ్యారని స్మరించుకున్నారు. అనంతరం డీఐజీ కార్యాలయం సమీపంలోని పోలీసు అమరవీరుల స్మారక స్తూపం వద్ద కలెక్టర్ విజయేందిర బోయి, డీఐజీ, ఎస్పీ పుష్పగుచ్ఛాలను ఉంచి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరుల కుటుంబాల సభ్యులతో వారు మాట్లాడుకున్నారు. వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. తర్వాత ఎస్పీ కార్యాలయం నుంచి మొదటి పట్టణ ఠాణా వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడే ఉన్న ఎస్పీ పరదేశి నాయుడు కాంస్య విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రాములు, సురేశ్‌కుమార్, జైలు సూపరింటెండెంట్ వెంకటేశం, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, వెంకటరమణారెడ్డి, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ : వన్‌టౌన్ కూడలిలోని పరదేశి నాయుడు విగ్రహం ముందు నివాళులర్పిస్తున్న జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ డి.జానకి, ఏఎస్పీలు రాములు, సురేశ్ కుమార్, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు

పంటల సర్వేపై చిక్కుముడి



సాగు పనుల్లో రైతులు (పాతచిత్రం)

కొత్తకోట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పంటల సాగుపై డిజిటల్ సర్వే చేయాలని ఏఈవో (వ్యవసాయ విస్తరణ అధికారు)లను ఆదేశించడంతో వారు నిరాకరించడం సర్వే సందిగ్ధంలో పడింది. కేంద్ర ప్రభుత్వం సమగ్ర వ్యవసాయంపై రూపొందించిన ఈ యాప్ ద్వారా క్షేత్ర స్థాయిలో రైతులు సాగు చేస్తున్న భూముల వివరాల్ని నమోదు చేయాల్సి ఉంటుంది. సర్వేకు కేంద్రం నిధులు కేటాయించగా కర్ణాటక, ఆంధ్ర తదితర రాష్ట్రాల్లో వ్యవసాయ శాఖ ప్రత్యేక వాలంటీర్లను నియమించి సర్వే చేపడుతోంది. కాగా తెలంగాణలో మాత్రం ఏఈవోలే వీటిని చేయాలంటూ ఆదేశించింది. దీనిని వ్యతిరేకిస్తున్న ఏఈవోలు విధులకు హాజరవుతున్నా గత నెల 24 నుంచి గైర్హాజరు వేస్తున్నారు. విధులను ఖాతారు చేయని అవుట్ సోర్సింగ్ ఏఈవోలను విధుల నుంచి తొలగిస్తామని మెమోలు జారీ చేశారు. దీంతో రెగ్యులర్ ఏఈవోల్లో ఆందోళన నెలకొంది. అయినప్పటికీ సర్వే మాత్రం ముందుకు సాగడం లేదు.

- గ్రామాల్లో వ్యవసాయం చేస్తున్న వారి వివరాలే కాకుండా సాగులోకి వస్తున్న భూములు, పంటలు వంటివి డిజిటల్‌లో నమోదు చేయడం వల్ల వ్యవసాయ శాఖ క్షేత్ర స్థాయి పట్టు సాధించడం వీలవుతుందని ఈ సర్వేను నిర్దేశించారు. ఇప్పటి వరకు ధరణి నమోదు ఆధారంగా గ్రామాల్లో వీఆర్ఏ, కావలి కారు వంటివారి సహకారంతో రైతు చెప్పిన విధంగా పంటల సాగును వ్యవసాయశాఖ నమోదు చేసేది. వీటన్నింటికీ చెక్‌పెడుతూ సర్వే నంబర్, సాగు ఫొటో ఆధారంగా పంటలు నమోదు చేస్తారు. ఈ సర్వే వివరాల ఆధారంగానే రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను ఇద్దామని యోచిస్తోంది.

ఒక్కరికి అసాధ్యమే ! : గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి అక్కడి నుంచే ఫొటోలతో ఆయా రైతు వివరాలను నమోదు చేయాలంటే ఒక్క ఏఈవోల తోనే సాధ్యమయ్యే పనికాదని వారు చెబుతున్నారు. తమకు సహాయంగా మరొకరిని ఇస్తే గాని గ్రామాల్లో ఈ సర్వే పూర్తి చేయలేమన్నది వారి వాదన. ఏఈవోలుగా స్త్రీలు పని చేస్తున్నారని ఒక్కరే అడవులు, చెరువులు, కుంటలు తిరుగుతూ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లడం సులభమైన పని కాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంటి అటవీ ప్రాంత వ్యవసాయ క్షేత్రాల్లో ఇది మరింత ఇబ్బందికరమని మహిళా ఏఈవోలు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ శాఖలో 49 రకాల పనుల్ని చక్కబెడుతున్న తమకు డీటీఎస్ తీవ్ర ఇబ్బందులు కలిగించే అంశంగా వారు భావిస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు జిల్లాలో వీరు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోలేదు. అందులోనే వ్యక్తిగత హాజరు నమోదు చేయాలని నిర్దేశించినప్పటికీ ఈ విధులకు దూరంగా ఉంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో రైతులు సాగు చేసిన భూమి వివరాలు...

జిల్లా	రైతులు	సాగు భూములు (ఎకరాల్లో)
నాగర్‌కర్నూల్	1,26. 549	5,62,299
నారాయణ పేట	1,38,267	4,64,440
జోగులాంబ గద్వాల	2,58,901	3,40,677
మహబూబ్‌నగర్	1,76,474	3,21,512
వనపర్తి	1,30,894	2,35,250
మొత్తం	8,31,085	19,24,178

రూ.36 లక్షలతో క్రికెట్ మైదానం అభివృద్ధి

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి



మైదానంలో టర్ఫ్‌వికెట్ పిచ్‌కు శంకుస్థాపన చేస్తున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : దాతల సహకారంతో రూ.36లక్షల నిధులు వెచ్చించి మహబూబ్‌నగర్‌లోని జిల్లా క్రికెట్ సంఘం(ఎండీసీఏ) మైదానం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మాజీ ఎంపీ ఏపీ జితేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎండీసీఏ మైదానంలో టర్ఫ్ వికెట్ పిచ్‌లకు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావుతో కలసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎండీసీఏ మైదానంలో పవేలియన్, విశాలమైన హాలు, జిమ్, కిచెన్ నిర్మించనున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం క్రీడలను విస్మరించిందని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి క్రీడాకారుడు కావడంతో క్రీడలకు పెద్దమొత్తంలో బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు చెప్పారు.

- హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ తెలంగాణలో హెచ్‌సీఏకు ఉప్పల్ తర్వాత ఉన్న ఏకైక మైదానం మహబూబ్‌నగర్‌లోనిదేనని తెలిపారు. ఈ మైదానంలో మూడు టర్ఫ్ వికెట్ పిచ్‌లు, గ్రీన్ గ్రాస్, వర్షపునీరు నిలవకుండా భూగర్భ డ్రైనేజీ తదితరాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. రంజీ క్రీడా టోర్నీలు నిర్వహించేలా తీర్చిదిద్దుతామన్నారు. త్వరలో రాష్ట్రస్థాయి అండర్-14 లేదా అండర్-16 టోర్నీని మహబూబ్‌నగర్‌కు కేటాయిస్తామన్నారు. జిల్లాల్లో క్రికెట్ అకాడమీల ఏర్పాటుకు నిర్ణయించామని, మొదటి ప్రాధాన్యంగా మహబూబ్‌నగర్‌కు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రేకుల షెడ్డు(కన్నోపి) ఏర్పాటుకు రూ.5లక్షలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పురపాలిక ఛైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మైదానంలో స్టోర్ భవనానికి రూ.5లక్షలు సమకూరుస్తామని, రెండు హైమాస్టు దీపాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజ్, ఉపాధ్యక్షుడు దల్జీత్ సింగ్, కోశాధికారి సీజే శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి బస్వరాజ్, ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, ప్యాట్రన్ వి.మనోహర్ రెడ్డి, ఉపాధ్యక్షులు టి.సురేశ్, అశోక్, లక్ష్మీకాంతరావు, సంఘం సభ్యులు చంద్రకుమార్ గౌడ్, గోపాలకృష్ణ, కృష్ణమూర్తి, అబ్దుల్లా, మన్నాన్, ఆబెద్ తదితరులు పాల్గొన్నారు.

10మంది జీహెచ్‌ఎంలపై కొరడా

తప్పుగా స్పౌజ్ పాయింట్లు వాడారని సస్పెన్షన్ వేటు

పాలమూరు, న్యూస్‌టుడే : జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న ఇన్‌ఛార్జి మండల విద్యాధికారులు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల(జీహెచ్‌ఎం)లపై విద్యా శాఖ కొరడా ఝులిపించింది. గతేడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన జీహెచ్‌ఎంల బదిలీల్లో స్పౌజ్ పాయింట్ల వినియోగంలో తప్పులు చేశారని ప్రాంతీయ విద్య సంచాలకులు (ఆర్జేడీ) విజయలక్ష్మి ఆదివారం వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది 60 వరకు జీహెచ్‌ఎంలు వివిధ పాఠశాలలకు బదిలీ అయ్యారు. అందులో 17 మంది స్పౌజ్ విభాగంలో బదిలీల కోసం దరఖాస్తు చేశారు. భర్త ఒక చోట, భార్య మరో చోట ఉండటంతో పలువురు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా ఆర్జేడీ విచారణకు ఆదేశించారు. అందులో 15 మందిపై రెండు నెలల క్రితం విద్యాశాఖ అధికారులు విచారించి నివేదిక ఆర్జేడీకి సమర్పించారు. సంబంధిత జీహెచ్ఎంల నుంచి సంజాయిషి పత్రాలు తీసుకున్నారు. వాటిని పరిశీలించిన అనంతరం రాష్ట్ర విద్యాశాఖ చర్యలు చేపట్టింది. సస్పెన్షన్ ఉత్తర్వులను సంబంధిత మండల విద్యాధికారులు ఆయా జీహెచ్‌ఎంలకు పంపించారు.

సస్పెన్షన్‌కు గురైన వారి వివరాలు ఇలా ఉన్నాయి.

జీహెచ్‌ఎం	పనిచేస్తున్న ప్రాంతం
వనజ	నవాబ్‌పేట మండలం యన్మన్‌గండ్ల జడ్పీహెచ్‌ఎస్
సరస్వతి	బాలానగర్ బాలికల ఉన్నత పాఠశాల
నాగేంద్రమ్మ	దేవరకద్ర బాలికల ఉన్నత పాఠశాల
నాగ్యానాయక్	నవాబ్‌పేట మండల విద్యాధికారి
యుగేంధర్	జడ్చర్ల మండలం ఆలూరు ఉన్నత పాఠశాల
వెంకటేశ్వరమ్మ	మహబూబ్‌నగర్ మండలం కోడూరు ఉన్నత పాఠశాల
కృష్ణవేణి	గండీడ్ మండలం కొమ్మిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల
కృష్ణయ్య	మహబూబ్‌నగర్ గ్రామీణ మండల విద్యాధికారి
చంద్రకళ	బాదేపల్లి బాలుర ఉన్నత పాఠశాల, జడ్చర్ల
వెంకట్‌రెడ్డి	జడ్చర్ల మండలం పోలేపల్లి ఉన్నత పాఠశాల

- జిల్లాలో సస్పెన్షన్‌కు గురైన 11 మంది జీహెచ్‌ఎంల వివరాలను మరోమారు పరిశీలించి వెంటనే తమకు నివేదికను పంపించాలని ఆర్జేడీ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారని వినిపించింది. జిల్లా విద్యాశాఖ అధికారులు 10 మందికి సస్పెన్షన్ ఉత్తర్వులు పంపించారు. ఒకరికి ఉత్తర్వులు పంపించలేదన్న చర్చ జరిగింది. మంగళవారం ముగ్గురు జీహెచ్‌ఎంలతో కమిటీతో మరోసారి సస్పెన్షన్‌కు గురైన వారి ఆప్షన్ పత్రాలను పరిశీలించనున్నారు. అనంతరం నివేదికను తయారు చేసి మరోసారి ఆర్జేడీకి పంపించనున్నట్లు సమాచారం. డీఈవో రవీందర్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా 10 మందికి సంబంధించిన సస్పెన్షన్ ఉత్తర్వులు మాత్రమే తన వద్దకు వచ్చాయని, వాటిని పంపించానని పేర్కొన్నారు. 11 మంది సస్పెన్షన్‌కు గురైనట్లు తనకు తెలియదని పేర్కొన్నారు.

ఒక్కొక్కరుగా దూరమై.. జీవనం భారమై!

మానవీయం

మహమ్మదాబాద్, న్యూస్‌టుడే : అమ్మానాన్నలు, సోదరుడు, తాత, నానమ్మలను వరుసగా కోల్పోయి ఓ యువతి అనాథగా మిగిలిన దయనీయ గాథ ఇది. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల కేంద్రానికి చెందిన బి.రాములుది పేద కుటుంబం. ఆయనకు భార్య జయమ్మ, తండ్రి అనంతయ్య, తల్లి మాసమ్మ, కుమారుడు సాయికిరణ్, కుమార్తె స్నేహ ఉన్నారు. కూలి పనులతో వచ్చే అరకొర ఆదాయంతో జీవనం సాగించే ఆ కుటుంబాన్ని మధుమేహం కబలించింది. తాము మధుమేహం బారినపడ్డామన్న విషయాన్ని రాములు, జయమ్మ ఆలస్యంగా గుర్తించారు. అప్పటికే పరిస్థితి చేయిదాటి అనేక అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. 2014లో జయమ్మ చనిపోయారు. మరుసటి సంవత్సరం రాములు మరింత అస్వస్థతకు గురయ్యారు. ఆసుపత్రి ఖర్చులకు ఎకరం పొలాన్ని అమ్మినా ఫలితం లేకపోయింది. 2016లో ఆయన మృతిచెందారు. అమ్మానాన్నలు లేకున్నా అన్న, తాత, నానమ్మ



తల్లిదండ్రుల చిత్రపటంతో స్నేహ

ఉన్నారని స్నేహ అనుకున్నంతలోనే మరొకరిని కోల్పోవాల్సి వచ్చింది. కుమారుడు, కోడలును కోల్పోయిన దిగులుతో వృద్ధుడైన అనంతయ్య 2017లో మరణించారు. కొంతకాలానికి అన్న సాయికిరణ్ అనారోగ్యం పాలయ్యారు. 2024 ఆగస్టు 26న ఆయన చనిపోయారు. వృద్ధాప్యంతో నానమ్మ మాసమ్మ 2024 సెప్టెంబరు 16న మరణించారు. నెల వ్యవధిలోనే అన్న, నానమ్మ దూరమయ్యారు. విధి పగబట్టినట్లుగా కుటుంబంలోని ఒకరి తర్వాత మరొకరిని.. మొత్తం ఐదుగురిని బలి తీసుకోవటంతో స్నేహ అనాథగా మారింది. ఆమెను తీవ్రంగా కుంగదీసింది. ప్రస్తుతం స్నేహ మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతోంది. ఉన్నత విద్య అభ్యసించి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న ఆమె కలలన్నీ కరిగిపోయి కన్నీరే మిగిలింది. కుటుంబ సభ్యులను తలచుకుని దుఃఖిస్తూ.. శిథిలావస్థకు చేరిన పాత పెంకుటిల్లులో బిక్కుబిక్కుమంటూ ఒంటరిగా జీవనం సాగిస్తోంది. అనాథగా మారిన స్నేహకు ప్రభుత్వం అండగా నిలవాలని, ఆమెను వసతి గృహంలో చేర్పించి ఉన్నత విద్య చదివించటంతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బంతి తోట.. లాభాల బాట

రైతేరాజు

ధన్వాడ, న్యూస్‌టుడే : గాలి ఉన్నప్పుడే తూర్పార బట్టాలి అనే నానుడిని వంట బట్టించుకున్న నారాయణపేట జిల్లా మరికల్‌కు చెందిన మహిళా రైతు పోలమోని లక్ష్మమ్మ.. బంతి పూలసాగులో ప్రణాళికతో ముందుకెళ్తూ ఏటా లాభాలు అందుకుంటున్నారు. ఈమెకు 2.30 ఎకరాల పొలం ఉంది. ఓ చోట రెండెకరాలు, మరో చోట 30 గుంటల భూమి ఉంది. ఇందులో అర ఎకరాలో బంతిపూలు సాగు చేశారు. బతుకమ్మ వేడుకలు ప్రారంభానికి నలభై రోజుల ముందు నారు నాటుతారు. పూల దిగుబడి అప్పటి నుంచి మొదలైతే దీపావళి, కార్తిక పౌర్ణమి వరకు కొనసాగుతుంది. ఈ సీజన్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంటుంది.



తోటలో రైతు లక్ష్మమ్మ

ఖర్చు రూ.20 వేలు.. లాభం రూ.50 వేలు: నారు నాటినప్పటి నుంచి పూలు చేతికి వచ్చే వరకు రూ.20 వేలు ఖర్చు అవుతుందని లక్ష్మమ్మ తెలిపారు. తొలి కాపు పూలు విక్రయించగా చేతికి రూ.30 వేలు దక్కాయని, పెట్టుబడి పోగా రూ.పది వేలు ఆదాయం వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం రెండో కాపులో పూలు విరగకాశాయని వీటిని విక్రయిస్తే కనిష్ఠంగా మరో రూ.40 వేలు లాభం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ నీటి తడులు అందిస్తే మూడో కాపు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పూలకు డిమాండ్ ఉంటే మరో రూ.30 వేలు వస్తాయన్నారు. గతేడాది మూడు కాపులు బాగా కాశాయని ఆమె తెలిపారు.

గత ఏడాది రూ.లక్ష వరకు విక్రయాలు:
నా పొలం పట్టణానికి సమీపంలో ఉండటంతో రోజూ నా భర్త ఉదయం, సాయంత్రం వెళ్లి పర్యవేక్షిస్తారు. బంతిపూల సాగుకు శ్రమ పడాల్సిన అవసరం ఉండదు. గతేడాది రూ.లక్ష వరకు విక్రయాలు జరిగాయి. పెట్టుబడి పోగా రూ.80 వేలు దక్కాయి. ఈసారి రెండో కాపు వరకు రూ.70 వేలు చేతికి దక్కుతాయి. మూడో కాపులో డిమాండ్ ఉంటే రూ.లక్ష వరకు అమ్మకాలు జరుగుతాయి.
- పోలమోని లక్ష్మమ్మ, మరికల్

ముర్రుపాలు దూడలకు మేలు

బాలానగర్, న్యూస్‌టుడే : లేగ దూడలకు పోషణపరంగా శ్రద్ధ తీసుకుంటే అవి సకాలంలో మంచి పాడిపశువులుగా ఎదుగుతాయని పశువైద్యాధికారి రఘురాం కుమార్ తెలిపారు. చూడి పశువులకు ఏడో నెల నుంచే అదనంగా దాణా ఇవ్వాలని సూచించారు. దూడల్లో వ్యాధి నిరోధకశక్తి పెంపొందించేందుకు రోజుకు రెండు, మూడు సార్లు చొప్పున మొదటి మూడు రోజులు ముర్రుపాలు తాగించాలి. పుట్టిన గంటలోపే ఇవ్వాలి. తాగలేని దూడలను తల్లి వద్ద నిలబెట్టి తాగేలా సహకరించాలి. లేదంటే సీసాలో పోసి పాల పీక అమర్చి తాపాలి. వీటిలో శక్తినిచ్చే పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా దూడలను వ్యాధుల బారి నుంచి రక్షించే 'ఇంటినాడిన్' ఇందులో ఉంటాయి. వీటిని తాగని దూడల్లో పారుడు వ్యాధులు, ఏలిక పాములు ఆశిస్తాయి. వీటి వల్ల దూడలకు మలబద్ధకం సమస్య ఉండదని రఘురాం కుమార్ తెలిపారు.

మేలైన వంగడాల ఎంపిక కీలకం

మహబూబ్‌నగర్ వ్యవసాయం, న్యూస్‌టుడే : రబీలో మేలైన వంగడాలు ఎంచుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.వెంకటేశ్ సూచించారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురవడంతో ఎలాంటి నీటి సమస్య ఉండదని తెలిపారు. రైతులు ప్రస్తుతం నాణ్యమైన ఎక్కువ దిగుబడి ఇచ్చే పంటలు ఎంచుకోవాలని ఆయన పేర్కొన్నారు.

● వరిలో అగ్గి తెగులును తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చే వంగడాలు ఎంచుకోవాలి. ఇందులో స్వల్పకాలిక (120 రోజులు) రకాలు ఎంచుకుంటే మేలు. కాటన్ దొర సన్నాలు (ఎంటీయూ-1010), విజేత (ఎంటీయూ-1001), ఐఆర్-64, ప్రభాత్ (ఎంటీయూ-3626), నెల్లూరి మసూరి (ఆర్‌ఎన్‌ఆర్-34449), తెల్లహంస (ఆర్‌ఎన్‌ఆర్-10754), ఎర్రమల్లెలు (డబ్ల్యూఎల్-20471), జగిత్యాల సన్నాలు (జేజీఎల్-1798) మంచి ఫలితాలు ఇస్తాయి. ● జగిత్యాల సాంబ, అంజన, శ్వేత, తరంగ్, తెలంగాణ సోనా, బతుకమ్మ వంటి రకాలు సాగుకు అనుకూలం. ● మొక్కజొన్న, వేరుసెనగ, పప్పు శనగ, పొద్దుతిరుగుడు, మినుములు, నువ్వులు, ఆవాలు, రాగి, తెల్లకొర్ర, ఉలవ, పెసర వంటి పంటలు సాగు చేసుకోవచ్చు. ఆయా పంటల సాగు లాభదాయకంగా ఉంటుంది. ● ఉల్లి సాగు ఎంతో లాభదాయకం. ఎకరానికి సుమారు 100-150 క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చు. మార్కెట్లో ఇప్పుడు మేలైన వంగడాలు వచ్చాయి. ఎరుపు రంగు గడ్డకంటే లేత ఎరుపు రంగు ఉల్లికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది. ఎలాంటి మందులు పిచికారీ చేయాల్సిన అవసరం లేదు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చు.



ఉల్లి సాగు

సాగులో.. సమస్యలా?

మదనాపురం : సాగులో యాజమాన్య పద్ధతులపై అన్నదాతలు ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య చరవాణి నం : 94408 35658కి ఫోన్ చేస్తే సందేహాలను నివృత్తి చేస్తామని కేవీకే కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

ప్రశ్నలు - సమాధానాలు

? వరిలో పాము పొడ తెగులు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?
- మాసన్న, దుప్పల్లి

✔ లీటరు నీటికి థఫ్లూజమిడ్ 0.75 మి.లీ లేదా హెక్సాకోనోజోల్ 2 మి.లీ లేదా ప్రొఫికోనోజోల్ 1 మి.లీ లేదా ట్రైఫ్లాక్సీస్ట్రాబిన్ + టెబ్యూకోనోజోల్ 0.4 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

? వేరుసెనగలో పొగాకు లద్దె పురుగు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?
- బాలరాజు, నిర్వేన్

✔ న్యూవలురాన్ 1 మి.లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

? టమాటాలో ఆకుమాడు తెగులు నివారణకు చర్యలు తెలపండి
- వెంకటయ్య, చెన్నారం

✔ లీటరు నీటిలో కాప్టాన్ 3 గ్రాములు లేదా కార్బండిజియం + మ్యాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా ప్రొఫికోనోజోల్ ఒక మి.లీ లేదా అజాక్సిస్ట్రోబిన్ + టెబ్యూకోనోజోల్ 1.2 మి.లీ మందును కలిపి ఆకులు బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.



- డాక్టర్ రాజేందర్‌రెడ్డి, కీటక శాస్త్రవేత్త, కేవీకే మదనాపురం
- న్యూస్‌టుడే, మదనాపురం

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యకు కృషి

సినీనటి మంచు లక్ష్మి

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య, మౌలిక వసతుల కల్పనకు తమ సంస్థ కృషి చేస్తోందని టీచ్ ఫర్ చేంజ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు, సినీనటి మంచు లక్ష్మి పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం ఆలూరు గ్రామంలో డిజిటల్‌క్లాస్ నిర్మాణం ప్రారంభించేందుకు వచ్చిన ఆమె సోమవారం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి టెక్ సిస్ట్ సిస్టం కంపెనీ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. గతంలో గట్టు మండలంలో 30 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌ల నిర్మాణం చేపట్టామని.. త్వరలో మరో 20 పాఠశాలలు నిర్మిస్తామని ఆమె చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సంస్థ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 140 మంది ఉపాధ్యాయులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎంపిక చేసిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధన చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు, జడ్పీ సీఈవో కాంతమ్మ, డీఈవో రవీందర్‌లు పాల్గొన్నారు.



గద్వాల కలెక్టర్ సంతోష్‌తో మాట్లాడుతున్న సినీనటి మంచు లక్ష్మి

శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్‌ల పర్యటన



ఉండవల్లి బస్వాపురంలో శిక్షణ అధికారులకు పూలమొక్కలు అందజేసి, బతుకమ్మతో స్వాగతిస్తున్న అధికారులు

ధరూరు, ఉండవల్లి, మానవపాడు, ఇటిక్యాల, న్యూస్‌టుడే: ధరూరు మండల పరిధిలోని ఉప్పేరులో శిక్షణ ఐఏఎస్ అధికారులు సోమవారం పర్యటించారు. తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ, ఆదిలాబాదు, జోగులాంబ గద్వాల జిల్లాలలో ఎంపిక చేసిన గ్రామాల్లో గ్రామానికి 5 మంది చొప్పున 125 మంది శిక్షణ అధికారులు వచ్చారు. 3 రోజుల పాటు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పథకాల అమలు, సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి పనులు, కనీస వసతుల కల్పన తదితర అంశాలపై నివేదిక రూపొందించనున్నారు.
● ఉండవల్లి మండలం బస్వాపురం గ్రామానికి శిక్షణ అధికారులు లోకేష్‌కుమార్ (ఐఎస్ఎస్), రామకృష్ణ శరన్ (ఐపీఎస్), ప్రతీక్ గహ్లోట్(ఐపీఎస్), అతుల్ కుమార్‌సింగ్ (ఐఆర్ఎస్ ఐటీ), హిమాన్షు త్యాగి (ఐఎఫ్ఓఎస్) సోమవారం వచ్చారు. మానవపాడు మండలానికి 5 మంది శిక్షణ ఐఏఎస్ అధికారులు రాజీవ్.కె, వల్లి.ఎన్, ప్రసన్నకుమార్.వి, విజయ్ లధా, సాయలి అశోక్ గైక్వాడ్‌లు మండలంలోని కలుకుంట్ల గ్రామానికి సోమవారం చేరుకున్నారు. ఇటిక్యాల మండలంలోని కోదండాపురంకు సోమవారం శిక్షణా సివిల్ సర్వీస్ అధికారులు వచ్చారు. 2021 బ్యాచ్‌కు చెందిన లోకేష్ యాదవ్ (ఐపీఎస్), డింపుల్ యాదవ్(ఐఎస్ఎస్), బస్వారాజ్ ఎం వాలీకర్(ఐపీవోఎస్), నిఖితా యాదవ్(ఐసీఎల్ఎస్), 2022 బ్యాచ్‌కు చెందిన ఇంద్రజిత్ సిరా(ఐఎఫ్‌వోఎస్)లు ఉన్నారు. మల్దకల్ మండల పరిధిలోని పెద్దతాండలో శిక్షణ ఐపీఎస్ అధికారులు సోమవారం పర్యటించారు. వికాస్, పాల్వాయి విష్ణువర్ధన్‌రెడ్డి, ఐఎఫ్ఓఎస్ ఆదాం మోహియిద్దీన్, ఐపీఓఎస్ పుష్కర వర్మ, ఐపీఎస్ హర్షత్‌కుమార్ ఆలావాత్, తాండాలో పర్యటించి ఆర్థిక, సామాజిక అంశాలపై ముచ్చటించారు.

శ్రీశైలంలో నీటి విడుదల

శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్), న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతోంది. ఎగువన ఉన్న జూరాల, సుంకేశుల జలాశయాలు పూర్తిగా నిండటంతో దిగువకు నీటిని వదులుతున్నారు. దీంతో శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం పూర్తిస్థాయికి చేరింది. వరద ప్రవాహం కొనసాగుతుండటంతో ప్రాజెక్టు 5 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టు నుంచి 1,17,539 క్యూసెక్కులు, సుంకేశుల జలాశయం నుంచి 51,324 క్యూసెక్కుల ప్రవాహం వస్తుంది. శ్రీశైలం కుడి ఎడమ జల విద్యుత్ కేంద్రాల ద్వార 66,203 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వార 1,38,770 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు జలాశయంలో నీటి మట్టం 884.30 అడుగులకు, నీటి నిల్వ 211.4759 టీఎంసీలుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కొలువులు ఇచ్చే కొత్త కోర్సులు

● టాటా సంస్థ భాగస్వామ్యంతో మూడు ఐటీఐల్లో అమలు
● 30వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ



ఐటీఐ కళాశాలలో కొత్త కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న యువతులు

న్యూస్‌టుడే, పాలమూరు: విస్తృత ఉపాధి అవకాశాలు లభించే ఆరు అధునాతన సాంకేతిక కోర్సులు పాలమూరు యువతకు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం దిగ్గజ కంపెనీ టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్) ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 65 ప్రభుత్వ ఐటీఐలను అధునాతన సాంకేతిక కేంద్రాలు (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్ - ఏటీసీ)గా ఉన్నతీకరిస్తున్నారు. తొలి విడతగా ఈ ఏడాది 28 కళాశాలలు ఎంపిక చేయగా అందులో మహబూబ్‌నగర్(బాలికల), మన్ననూర్, వనపర్తి ఐటీఐలు ఉన్నాయి.

ఒక్కో కళాశాలలో 172 సీట్లు : ఒక్కో కళాశాలలో ఆరు కొత్త కోర్సుల్లో కలిపి 172 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన యువత ప్రవేశాలకు అర్హులు. ఈ నెల 30 వరకు దరఖాస్తులను అంతర్జాలం నుంచి స్వీకరిస్తారు. తర్వాత కోర్సులు ప్రారంభమవుతాయి. ఉమ్మడి జిల్లాలో బాలికల ఐటీఐ కళాశాల మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోనే ఉంది. ఈ కోర్సుల్లో మూడేళ్ల పాటు టాటా ప్రతినిధులే శిక్షణ ఇస్తారు. తర్వాత వివిధ పరిశ్రమల్లో వారికి ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తారు. ఎస్ఎస్‌సీ, కుల, బోనఫైడ్, స్థానికత ధ్రువీకరణ పత్రాలు, టీసీ, ఫొటో స్కాన్ చేసి http://iti.telangana.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

23న పనులకు శంకుస్థాపన : మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాల ప్రాంగణంలో బాలికలు, బాలురకు వేర్వేరుగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు వెచ్చించే నిధులను 85 శాతం టాటా, 15 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి. వాటిలో అన్ని రకాల యంత్ర సామగ్రి, పరికరాలు, ఫర్నిచర్, ఇతర సదుపాయాలు కల్పిస్తారు. ఈ పనులకు ఈ నెల 23న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మహబూబ్‌నగర్‌లో శంకుస్థాపన చేయనున్నారు.

- మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ - ఏడాది 40
- ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ - ఏడాది 40
- బేసిక్ డిజైనర్, వర్చ్యువల్ వెరిఫైర్ - రెండేళ్లు 24
- ఆర్టిసన్ యూసింగ్ అడ్వాన్స్ టూల్స్ - ఏడాది 20
- అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్ - రెండేళ్లు 24
- మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ - రెండేళ్లు 24



సద్వినియోగం చేసుకోవాలి.. : రాబోయే కాలంలో భారీ డిమాండ్ ఉన్న కోర్సులను ఎంచుకుంటే కొలువులు లభిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం, టాటా కంపెనీ కలిసి నిర్వహించే ఆరు కొత్త కోర్సులను ఉమ్మడి జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలి. అర్హులందరూ త్వరగా దరఖాస్తు చేసుకోవాలి. సందేహాల నివృత్తికి 83742 50330, 95500 54418, 98484 66028 నంబర్లలో సంప్రదించొచ్చు.



- గోపాల్ నాయక్, ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, మహబూబ్‌నగర్

మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులకు అస్వస్థత

వివరాలు గోప్యంగా ఉంచిన ఉపాధ్యాయులు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన బిజినేపల్లి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. శాయిన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం భోజనం చేసిన చిన్నారుల్లో 15 మంది వాంతులు చేసుకున్నారు. ఉపాధ్యాయులు బిజినేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం విద్యార్థులను పాఠశాల వద్ద వదిలిన ఉపాధ్యాయులు ఎంఈవోకు గాని, తల్లిదండ్రులకు గాని సమాచారం ఇవ్వకుండానే సాయంత్రం ఇంటికి వెళ్లిపోయారు. పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రులు అందుబాటులో లేకపోవడంతో కొందరు విద్యార్థులు పాఠశాల ఆవరణలోనే వేచి ఉన్నారు. గ్రామస్థులు ఆరా తీయడంతో విషయం బయటకు తెలిసింది. ఎంఈవో రఘునందన్‌శర్మను వివరణ కోరగా, విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం ఆలస్యంగా తెలిసిందన్నారు. మంగళవారం పాఠశాలను సందర్శించి బాధ్యులపై చర్యలు తీసుకుంటానన్నారు.



శాయిన్‌పల్లి పాఠశాల వద్ద అస్వస్థతకు గురైన విద్యార్థులు

ఆటో ఢీకొని మహిళ మృతి

ముగ్గురు పిల్లలకు గాయాలు

కృష్ణా, న్యూస్‌టుడే : హిందుపూర్, టైరోడ్ మధ్య ఆటో ఢీకొని కర్రెమ్మ(60) అనే మహిళ మృతి చెందింది. కృష్ణా పోలీసుల కథనం ప్రకారం సోమవారం సాయంత్రం కర్ణాటకలోని శక్తినగర్ నుంచి ప్రయివేటు పాఠశాల విద్యార్థులను హిందుపూర్‌కు ఆటో తీసుకువస్తుండగా మహిళ అడ్డం రావడంతో ఆటో అదుపు తప్పి ఆమెను ఢీకొని బోల్తాపడింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ కర్రెమ్మను ప్రయివేటు వాహనంలో మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలిది గుడేబల్లూర్‌గా పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న ముగ్గురు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కతలప్ప తెలిపారు.

బాలికతో వెట్టి.. ఆపై దొంగతనం నెపం

● మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం
● జోగులాంబ గద్వాల జిల్లాలో దారుణం

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: గద్వాలలోని ఓ సీడ్ ఆర్గనైజర్ తన ఇంట్లో బాలిక(16)తో వెట్టి చాకిరి చేయించుకోవడంతోపాటు దొంగతనం నెపం మోపడంతో ఆ బాలిక పురుగు మందు తాగింది. సామాజిక మాధ్యమాల్లో సోమవారం వైరల్‌గా మారిన ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్దకల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక గద్వాలలో నివాసం ఉంటున్న సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్‌రెడ్డి ఇంట్లో గత కొన్నేళ్లుగా పని చేస్తోంది. తన ఇంట్లో బంగారు ఆభరణాలు పోయాయని, ఇంట్లో పని చేసే బాలికే ఈ పనికి పాల్పడిందని మల్దకల్ ఠాణాలో ఆయన ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలికను ఠాణాకు పిలిపించి విచారించారు. తర్వాత చోరీ ఘటన తమ పరిధిలో లేదంటూ సీడ్ ఆర్గనైజర్‌కు వివరించారు. తాను దొంగతనం చేయకున్నా నింద మోపారని మనస్థాపం చెందిన బాలిక ఈనెల 12న తన ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న బాలికను కుటుంబ సభ్యులు గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు ఏపీలోకి కర్నూలుకు తీసుకెళ్లారు. బాలిక ఆరోగ్యం మరింతగా విషమించడంతో వైద్యులు ఏఎంసీలో ఉంచి వెంటిలేటరుపై చికిత్స అందిస్తున్నారు. సోమవారం ఈ విషయం వెలుగులోకి రావడంతో బాలిక తల్లి మల్దకల్ ఠాణాలో ఇంటి యజమానిపై ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గద్వాల డీఎస్పీ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా సంఘటనపై విచారణ జరుపుతున్నామని, బాలిక తల్లి ఫిర్యాదుపై వెట్టిచాకిరి చేయించుకుని దొంగతనం నెపంతో బాలిక ఆత్మహత్యాయత్నానికి కారకుడైన సీడ్ ఆర్గనైజర్‌పై మల్దకల్ ఠాణాలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : రైలు కింద పడి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. సుమారు 35 ఏళ్ల వయస్సు ఉండే గుర్తుతెలియని పురుషుడు బండమీదిపల్లి సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యులు ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు
మహబూబ్‌నగర్: 9948145978 జడ్చర్ల: 8008573899
దేవరకద్ర: 9000031648 భూత్పూర్: 8008563143

సమస్య: ఆజిలాపూర్-గడ్డంపల్లి రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి మరమ్మతులు చేయండి. **-అంజనేయులు, అజిలాపూర్**

సమాధానం: రహదారికి మరమ్మతులు చేసి ఇబ్బందులు తొలగిస్తాం. **-సత్యకృష్ణ ఏఈ**

రోడ్డు మరమ్మతులు చేయండి

సమస్య: భూత్పూర్ నుంచి బొల్లిగడ్డతండా, లంబడికుంటతండా, వాల్యాతండా, మిట్యాతండాలకు వెళ్లే ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారి రాకపోకలకు తీవ్రం ఇబ్బందులు పడుతున్నారు. **- శ్రీను, వాల్యాతండా**

సమాధానం: రహదారి విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లి, మరమ్మతులకు కృషి చేస్తా. **- స్వామి, ఏఈ**

-న్యూస్‌టుడే, దేవరకద్ర గ్రామీణం

తెరపై ఈనాడు

శ్రీనివాస - **విశ్వం,** తిరుమల - **వెట్టియాన్,** బాలాజీ - **జనక అయితే గనక,** వెంకటేశ్వర - **దేవర,** వెంకటాద్రి - **మా నాన్న సూపర్ హీరో,** మైత్రి శ్రీకృష్ణ - **సలార్ (తెలుగు)**
(– న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం)

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు : ఎస్పీ


దస్త్రాలు పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

మహమ్మదాబాద్, న్యూస్‌టుడే: మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ జానకి హెచ్చరించారు. సోమవారం మహమ్మదాబాద్ ఠాణాను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. ఆపద సమయంలో 100కు డయల్ చెయ్యాలని, సైబర్ క్రైం విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఎస్సై శేఖర్ రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సమస్యలపై అధికారులకు ఫిర్యాదుల వెల్లువ

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే : జడ్చర్ల పురపాలికలోని 3వ వార్డులోని గౌరీశంకర్‌కాలనీలో ఓ అపార్టుమెంట్ ప్రాంతంలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని స్థానిక కౌన్సిలర్ సతీష్ సోమవారం హైదరాబాద్‌లో విద్యుత్ వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు నాగేశ్వర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో పలు ప్రాంతాల్లో అదనపు విద్యుత్ నియంత్రికలు ఏర్పాటు చేయాలని కోరారు. 10వ వార్డులో బాలాజీనగర్‌లో ఇంటి నిర్మాణం చేస్తున్నవారు అదనంగా 10 ఫీట్లు ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని మాజీ వార్డుసభ్యులు ఖాజా మైనోద్దీన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. పురపాలికలోని మమతానగర్‌లో తమ ప్లాటును ఇతరులు ఆక్రమించారని శ్రీను కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఆర్థిక సాయం అందజేత

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే: కౌకుంట్లకి చెందిన చెన్నయ్య మృతి చెందడంతో పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన 1996-97 విద్యార్థులు రూ.21 వేలు అందించి తమ కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పాలమూరు, న్యూస్‌టుడే : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు వసంత అన్నారు. జిల్లా కేంద్రంలోని శేషాద్రినగర్‌లో సోమవారం మూడు నెలల పాటు కుట్టుమిషన్ నేర్చుకున్న మహిళలకు ఆమె ధ్రువీకరణ పత్రాలను అందించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే మహిళలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, నెలకు రూ. 2,500 నగదు పంపిణీని ప్రారంభిస్తుందని తెలిపారు. నిర్మాణ్ సంస్థ సమన్వయకర్త సుభాషిణి, సువేరా బేగం తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లలను పంపిణీ చేయండి

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే : మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ చేయాలని మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ యాదయ్య, మత్స్య సహకార సంఘం బాదేపల్లి అధ్యక్షుడు పిట్టల మురళీ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఏడాది వానాకాలంలో వర్షాలు బాగా పడి చెరువులు నిండినా నేటికి అన్ని గ్రామాలకు చేప పిల్లలు పూర్తిగా అందలేదని ఆరోపించారు.

సెక్యూరిటీ ఏజెన్సీలపై చర్యలకు డిమాండ్

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : శ్రమదోపిడీకి పాల్పడుతున్న ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, ఉపాధ్యక్షుడు వర్ద గాలెన్న సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జిల్లాలోని పలు ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలు నిరుద్యోగులను గార్డులుగా నియమించుకొని రోజూ 14 నుంచి 18 గంటల వరకు పనిచేయిస్తున్నాయని పేర్కొన్నారు. నెలకు రూ. 5వేలు లేదా రూ.6వేలే వేతనం ఇస్తున్నాయని ఆరోపించారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగం

నవాబ్‌పేట,న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్యం నిర్వహణ కోసం కొనుగోలు చేసిన వస్తువులు, పరికరాల విషయంలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు సమాచారం. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ మిషన్, లైమ్‌పౌడర్ మొదలగు వాటిని ఎక్కువ ధరలకు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొనుగోలుకు సంబంధించి మహ్మదాబాద్ బీసీ కాలనీ ఓ ట్రేడర్స్ దుకాణంలో కొనుగోలు చేసినట్లు రశీదులు పెట్టారు. నిధుల దుర్వినియోగానికి సంబంధించి పంచాయతీ కార్యదర్శులను వివరణ కోరగా.. ఓ అధికారి చెప్పడం వల్లే తాము కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ విషయమై ఎంపీడీవో జయరామ్‌నాయక్ 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. సమగ్ర విచారణ చేపట్టి సంబంధిత వ్యక్తులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

క్రీడా ప్రాంగణాల బిల్లులు ఇవ్వాలి

హన్వాడ, న్యూస్‌టుడే : మూడేళ్ల క్రితం గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు తాము చేసిన ఖర్చుల తాలూకు బిల్లులు ఇవ్వాలని మాజీ సర్పంచులు కోరుతున్నారు. ఈ మేరకు నాయినోనిపల్లి, పెద్దదర్పల్లి, తదితర గ్రామాల మాజీ సర్పంచులు సోమవారం మండల ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో యశోదకు వినతి పత్రాన్ని ఇచ్చారు.

108 వాహనంలో ప్రసవం

కోయిలకొండ, న్యూస్‌టుడే: జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవించిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. . కోయిలకొండ మండలం పారుపల్లికి చెందిన గర్భిణి అనితకు సోమవారం రాత్రి పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లడానికి కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. గర్భిణిని మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో మగబిడ్డ జన్మనిచ్చారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ రవిప్రకాశ్ పేర్కొన్నారు.

పోటీలతో ప్రతిభకు పదును



వశిష్ఠ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అకాడమిక్ సమన్వయకర్త పూజారి.. పాల్గొన్న విద్యార్థులు

జడ్చర్ల, న్యూస్‌టుడే: పోటీల్లో పాల్గొనటం ద్వారా విద్యార్థుల ప్రతిభ మరింత పదును తేలుతుందని వక్తలు పేర్కొన్నారు. జడ్చర్లలోని పలు పాఠశాలల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటారు. ఉదయ మెమోరియల్ పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో పదో తరగతి విద్యార్థిని వై.రక్షిత ప్రథమ, తొమ్మిదో తరగతి విద్యార్థిని ఇషా ఫిర్దౌస్ ద్వితీయ, పదో తరగతి విద్యార్థిని జి.హాసిని తృతీయ బహుమతులు సాధించారు. వారికి పాఠశాల ప్రిన్సిపల్ బాద్మి వీణ, వైస్ ప్రిన్సిపల్ బాద్మి నందిని బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బాద్మి వీణ మాట్లాడుతూ రామోజీ గ్రూప్ సంస్థల చైర్మన్‌గా రామోజీరావు అందించిన స్ఫూర్తిని వారి తనయుడు కిరణ్‌కుమార్ కొనసాగించడం అభినందనీయమన్నారు. 'ఈనాడు' పత్రికను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. పత్రిక, ఈటీవీ ద్వారా సమాజహితానికి చేస్తున్న కృషి మరవలేనిదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద రాజు, రవికుమార్, సమీర పాల్గొన్నారు. అంతకు ముందు వశిష్ఠ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎం.మహేందర్ ప్రథమ, దీపిక ద్వితీయ, వరుణ తృతీయ బహుమతులను సాధించారు. వారికి పాఠశాల అకాడమిక్ సమన్వయకర్త పూజారి పి.సంతోష్ బహుమతులను అందజేశారు.



ఉదయ మెమోరియల్ పాఠశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ బాద్మి వీణ, వైస్ ప్రిన్సిపల్ నందిని.. పాల్గొన్న విద్యార్థులు


షట్టర్లు మూసివేసిన రైతులు

పీఏసీఎస్ కార్యాలయం మూసి నిరసన

మహమ్మదాబాద్, గండీడ్, న్యూస్‌టుడే: రైతు రుణమాఫీ విషయంలో సిబ్బంది అవకతవకలకు పాల్పడ్డారంటూ గండీడ్ పీఏసీఎస్ వద్ద సోమవారం రైతులు ఆందోళనకు దిగారు. సిబ్బందిని బయటికి పంపించి కార్యాలయం షట్టర్లు మూసేసి నిరసన తెలిపారు. చనిపోయిన వ్యక్తుల పేర రుణాలు రెన్యువల్, సంఘంలో ఖాతా లేకున్నా రుణం తీసుకున్నట్టు రుణమాఫీ జరిగినట్టు చదవాలని సమాచారం రావడం, ఒకే పేరున్న వారి ఆధార్ కార్డులు వేర్వేరు ఖాతాలకు లింక్ కావడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల చాలామంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. ఇలాంటి వారు ఉమ్మడి మండలంలో ప్రతి గ్రామంలో ఉన్నారని ఉన్నతాధికారులు విచారణ జరిపి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

వైభవంగా అగ్నిగుండ మహోత్సవం


జడ్చర్ల: అగ్నిగుండంలో నడుస్తున్న భక్తుడు

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని కుర్వగడ్డపల్లి గ్రామపంచాయతీలోని మీనాంబరం పరుసవేదీశ్వరస్వామి ఆలయంలో సోమవారం అగ్నిగుండ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గణపతి స్వామి, అమ్మవారికి అభిషేకాలు చేశారు. అగ్నిగుండంలో భక్తులు నడిచారు. పరుసవేదీశ్వరస్వామి నామస్మరణతో ఆలయం మార్మోగింది. శివపార్వతుల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలు తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపాల్, సభ్యులు యాదయ్య, పర్వతాలు, జవహర్, శ్రీనివాసులు, భద్రప్ప, రాములు పాల్గొన్నారు.

రాజాపూర్: మండలంలోని ముదిరెడ్డిపల్లి పంచాయతీ నందిగామలో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఊరంతా కిటకిటలాడింది.


జడ్చర్ల: శివపార్వతుల కల్యాణోత్సవంలో అర్చకులు, భక్తులు


హోమంలో పాల్గొన్న భక్తులు


బాలానగర్: ర్యాలీలో మాట్లాడుతున్న ఎస్సై తిరుపాజీ


వీహెచ్‌పీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ

అమరుల త్యాగాలు చిరస్మరణీయం


మహబూబ్‌నగర్ : సీనియర్ సిటిజన్ ఫోరం ప్రతినిధులు, పోలీసు అధికారులు

బాలానగర్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్సై తిరుపాజీ అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం ఇక్కడ ఫ్లాగ్‌డే నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

నవాబ్‌పేట: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి అమరవీరులకు నివాళులర్పించారు. ఎస్సై విక్రమ్, సిబ్బంది, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జడ్చర్ల పట్టణం: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని కౌన్సిలర్ చైతన్య చౌహాన్ అన్నారు. సోమవారం జడ్చర్ల పురపాలికలోని విజయనగర్‌కాలనీలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసు అమరవీరుడికి ఘన నివాళి అర్పించారు. నాయకులు భాస్కర్‌రెడ్డి, డి.శ్రీను, విశ్వనాథ్, కృష్ణారెడ్డి, సూర్య చౌహాన్ పాల్గొన్నారు.

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్): సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌నగర్ పట్టణంలో పోలీసు సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్న పరదేశి నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, ప్రధాన కార్యదర్శి నస్కంటి నాగభూషణం, ప్రతినిధులు ఎ.నారాయణరావు, రాజసింహుడు, సురేశ్‌బాబు, రాములు, హన్మంత్‌రెడ్డి, అహ్మద్, పోలీసు అధికారులు పాల్గొన్నారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. గడియారం చౌరస్తా నుంచి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పరదేశినాయుడు విగ్రహానికి నివాళులర్పించారు. వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ప్రతినిధులు సురేశ్, లక్ష్మీనారాయణ, రాచాల జనార్దన్, హన్మంతు, కుమార్, శ్రావణ్, అయ్యప్ప, సంపత్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు చర్యలు


ఆర్పీల సమావేశంలో మాట్లాడుతున్న పుర ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వేదికపై కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే : యువతీ, యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మహబూబ్‌నగర్ పట్టణం బీఎన్‌రెడ్డికాలనీ రెడ్డి బాలికల వసతిగృహంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయిస్తున్నట్లు పురపాలక ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. మెప్మా కమ్యూనిటీ భవనంలో పట్టణంలోని ఆర్పీలతో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఛైర్మన్ శిక్షణ కేంద్రం వివరాలు వెల్లడించారు. సెట్విన్ సంస్థ పర్యవేక్షణలో శిక్షణ కేంద్రం కొనసాగుతుందని, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ఈనెల 23వ తేదీ ప్రారంభిస్తామని తెలిపారు. కంప్యూటర్ ఎంఎస్ ఆఫీస్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైన్, టైలరింగ్ వంటి వృత్తుల్లో యువతీ యువకులకు మూడు మాసాల పాటు శిక్షణ ఇస్తారని, పట్టణంలోని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెప్మా ఆర్పీలు మంగళవారం తమ పరిధిలోని వార్డుల్లో ఇంటింటికి వెళ్లి నిరుద్యోగ యువతీ, యువకులను గుర్తించి వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం గురించి వివరించాలని, ఆసక్తి చూపే వారితో దరఖాస్తు చేయించాలని కోరారు. పుర కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న యువతీ, యువకులకు సెట్విన్ ద్వారా ధ్రువపత్రాలు అందజేస్తారని, వాటికి మార్కెట్‌లో మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. సమావేశంలో టీఎంసీ వరలక్ష్మి, సీవోలు నిర్మల, దేవమ్మ, ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు పాపారాయుడు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 29అమలుతో నిరుద్యోగులకు అన్యాయం

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే : ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగులతో కలిసి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ హెచ్చరించారు. సోమవారం జడ్చర్లలో బీసీ జాగృతి సేన ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో 29 అమలుతో వెనుకబడిన సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు ఉద్యోగ కల్పనలో మరోమారు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగులు శాంతియుతంగా నిరసన తెలిపితే లాఠీచార్జ్ చేయడం సరికాదన్నారు. నాయకులు నిరంజన్, నర్సిములు, శేఖర్, గోపాల్, మహేష్, వెంకటేశ్, ధనుష్ పాల్గొన్నారు.

పీయూలో క్రీడా జట్ల ఎంపికలు

పాలమూరు : పాలమూరు విశ్వవిద్యాలయంలో కబడ్డీ మహిళలు, పురుషుల జట్లను సోమవారం ఎంపిక చేశారు. బాలుర విభాగంలో శివకృష్ణ, నవీన్, గోవర్దన్, జగదీశ్, మధు, వెంకటేశ్, సతీష్, వినయ్, సాగర్, విజయ్‌కుమార్, రాజేందర్, నగేశ్, కౌశిక్, శ్రీకాంత్, వీరేశ్, హేమంత్, అనిల్, నరేశ్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో జ్యోతి, సునీత, రాజేశ్వరి, లక్ష్మి, అంజలి, పద్మ, అనూష, సింధుప్రియ, జానకమ్మ, శ్రావణి, మరియమ్మ, రాణి, శిరీష, అనిత, నిఖిత, సరిత ఎంపిక చేసినట్లు పీడీ శ్రీనివాసులు తెలిపారు.

పనితీరు మార్చుకోకుంటే చర్యలు: కలెక్టర్


ఫిర్యాదు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

కోయిలకొండ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఆమె హాజరయ్యారు. గ్రామాలు శుభ్రంగా ఉంచుతున్నారా? అని కార్యదర్శులను ప్రశ్నించగా ఒక్కరు కూడా సమాధానం చెప్పకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోసారి నేరుగా గ్రామాల్లోకి వెళ్లి తనిఖీ చేస్తానన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా నిర్వహణ సమర్థంగా నిర్వహించాలని సూచించారు. కుటుంబ సర్వే, ఇందిరమ్మ ఇళ్ల కమిటీల్లో పొరపాట్లకు తావివ్వకుండా కీలకంగా వ్యవహరించాలన్నారు. ఇబ్రహీంనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని వెంటనే సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కలెక్టర్‌కి వినతి అందించగా సానుకూలంగా స్పందించారు. తహసీల్దార్ రాజా గణేశ్, ఎంపీడీవో కాళప్ప, ఎంఈవో వెంకట్‌జీ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణికి వచ్చిన వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజావాణికి 80 అర్జీలు వచ్చాయి. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్.మోహన్ రావు, స్పెషల్ కలెక్టర్ రాంరెడ్డి, జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీవో నరసింహులు, ఆర్డీవో నవీన్ పాల్గొన్నారు.

శ్మశాన వాటిక కబ్జా చేశారంటూ.. : క్రిస్టియన్‌పల్లి శివారులో సర్వే 439 సర్వే నంబరులో 4.20 ఎకరాల ప్రభుత్వ భూమి శ్మశాన వాటికకు కేటాయించగా వినియోగించుకుంటున్నామని పాత పాలమూరువాసులు పేర్కొన్నారు. ఇటీవల ఆ భూమిని కొందరు కబ్జా చేసి పొక్లెయిన్లతో చదును చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

పరిహారం ఇవ్వడంలో నిర్లక్ష్యం..: భూత్పూరు-చించోలి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా బండమీదిపల్లి సమీపంలో కోల్పోతున్న ఇళ్ల స్థలాలకు సగమే పరిహారం ఇస్తామంటూ అధికారులు చెప్పడం తగదని బాధితుడు రాజు తదితరులు కలెక్టర్‌కు విన్నవించారు. ప్లాటుకు పూర్తి స్థాయిలో పరిహారం ఇవ్వాలని, లేదంటే కోర్టును ఆశ్రయిస్తామని పేర్కొన్నారు.

భూత్పూర్ : భూత్పూర్ ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి రెండు ఫిర్యాదులు అందినట్లు అధికారి ప్రభాకర్ తెలిపారు. పాతమొల్గర శివారులోని పేపర్ పరిశ్రమ నుంచి మురుగు పొలాల్లో చేరుతుందని, పరిశ్రమ వల్ల పొలాలు, సాగునీరు కలుషితమవుతున్నాయని బాధిత రైతులు తెలిపారు. పరిశ్రమను అక్కడి నుంచి తరలించాలని కోరారు.

రాజాపూర్ : రాజాపూర్ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఏడు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీవో మచ్చేందర్, డిప్యూటీ తహసీల్దార్ భారతి తెలిపారు. నాలుగు పంచాయతీరాజ్, రెండు రెవెన్యూ, ఒకటి విద్యుత్తు శాఖకు సంబంధించిన దరఖాస్తులందాయన్నారు.

బాలానగర్ : ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఉదయం 11 గంటలైనా పలువురు మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు హాజరుకాలేదు. వివిధ సమస్యలపై ఒక వినతి వచ్చినట్లు ఎంపీడీవో అనిల్ కుమార్‌రెడ్డి తెలిపారు.


బాలానగర్: ఉదయం 11 గంటలకు ఖాళీగా ఉన్న కుర్చీలు

నవాబ్‌పేట : మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఒకేఒక్క వినతి వచ్చినట్లు ఎంపీడీవో జయరామ్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిడ్జిల్, న్యూస్‌టుడే : మండల ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం 4 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ రాజు తెలిపారు. ప్రజావాణిలో పలు సమస్యలపై వినతులు వచ్చినట్లు పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల సత్తా చాటుదాం


మాట్లాడుతున్న పాండుయాదవ్

మెట్టుగడ్డ(మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల సత్తా చాటి అధిక స్థానాలను కైవశం చేసుకోవాలని బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాండుయాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం మహబూబ్‌నగర్ పట్టణం లక్ష్మీనగర్‌కాలనీలో సంఘం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ఉచిత పథకాలకు ఆశ పడొద్దని, జనాభాలో 54 శాతమున్న బీసీలు రాజ్యాధికారం సాధనకు తమ ఓటు తమకే వేసుకోవాలన్నారు. 54 శాతమున్న బీసీలకు 23 శాతం రిజర్వేషన్లు, ఈడబ్ల్యూసీ ద్వారా 7 శాతమున్న అగ్రకులాలకు 10 రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని, ఇది దగా చేయటమేనని మండిపడ్డారు. హైదరాబాదులో నిరసన తెలుపుతున్న నిరుద్యోగులపై పోలీసులు లాఠీఛార్జీ చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు నిమ్మల వీరన్న, సంధ్యారాణి, ఖాసీనాథ్, విజయ్, తుమ్మల చెన్నయ్య, దేవేందర్, మహేశ్‌కుమార్, గణేశ్, భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

బాలానగర్: బాలానగర్ మండల కేంద్రానికి చెందిన గోపాలచారి రోడ్డు దాటుతుండగా జడ్చర్ల నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం షాద్‌నగర్ లో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

బాలానగర్, న్యూస్‌టుడే: షాద్‌నగర్ నుంచి జడ్చర్ల వైపు ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్గమధ్యలో మండలంలోని కేతిరెడ్డిపల్లి జాతీయ రహదారిపై బస్టాండ్ సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జడ్చర్లకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

హన్వాడ : పూజారితండాకు చెందిన కె.శివశంకర్ (24) ఈ నెల 10 నుంచి కనిపించటం లేదని తల్లి శారద ఫిర్యాదు చేశారని హన్వాడ ఎస్సై వెంకటేశ్ తెలిపారు. హైద్రాబాద్‌లో డ్రైవింగ్‌కు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాలేదన్నారు. ఆచూకి తెలిసిన వారు హన్వాడ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

రిఫ్రిజిరేటర్ పేలి ఇల్లు దగ్ధం

నవాబ్‌పేట : రిఫ్రిజిరేటర్ పేలి ఇల్లు దగ్ధమైన ఘటన మండల పరిధిలోని చాకల్‌పల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుడు చెన్నయ్య వివరాల ప్రకారం.. గత నెల మహబూబ్‌నగర్‌లోని ఓ ఎలక్ట్రానిక్స్‌లో దుకాణంలో రూ. 16,730లకు కొనుగోలు చేశారు. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం జరుగలేదు. నగదు, వంటసామగ్రి, బియ్యం, జొన్నలు, దుస్తులు అన్ని కాలిపోయినట్లు తెలిపారు.

ఇసుక వాహనాల పట్టివేత

రాజాపూర్ : రాయపల్లి శివారులోని దుందుభి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై కె.రవి తెలిపారు. పట్టుబడిన టిప్పర్‌ను ఠాణాకు తరలించారు. కానిస్టేబుల్ శంకర్ ఫిర్యాదు మేరకు టిప్పర్ యాజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జడ్చర్ల : ఇసుక టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. జాతీయ రహదారి 44 జడ్చర్ల సమీపంలో టిప్పర్‌లో అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తుండగా విధులు నిర్వహిస్తున్న పోలీసులు సోమవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో మేకపిల్లలు మృతి

జడ్చర్ల : కుక్కల దాడిలో 15 మేకపిల్లలు మృతిచెందిన ఘటన జడ్చర్ల మండలం కొదండాపూర్ గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బీరప్ప గొర్రెలను మేపడానికి ఉదండాపూర్ జలాశయం సమీపంలోని అడవిలోకి వెళ్లారు. ఈ క్రమంలో ఇంటి వద్ద ఉన్న మేకపిల్లలపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. రూ.లక్షకు పైగా నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు.

జీహెచ్‌ఎంలపై సస్పెన్షన్ వేటు తగదు


సస్పెన్షన్‌కు గురైన జీహెచ్‌ఎంలతో చర్చిస్తున్న సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీశ్

పాలమూరు, న్యూస్‌టుడే : జిల్లాలో పలువురు జీహెచ్‌ఎంలను సస్పెండ్ చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం సస్పెన్షన్ గురైన పలువురు జీహెచ్‌ఎంలతో కలిసి ఆయన మాట్లాడారు. స్పౌజ్ పాయింట్లను వినియోగించుకున్న వారిలో పలువురు ఒకే మండలంలో పని చేస్తున్నారని, వారిని కూడ ఓలా సస్పెండ్ చేస్తారని ఆయన ప్రశ్నించారు. వారిపై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎంల పోస్టులు మల్టీ జోన్‌కు సంబంధించినవని, బదిలీల్లో రాష్ట్రంలోని ఏ పాఠశాలనైనా ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు. నిబంధనల ప్రకారం సాంకేతికంగా సాఫ్ట్‌వేర్ అనుమతించిన పాఠశాలలను మాత్రమే జీహెచ్‌ఎంలు ఎంపిక చేసుకున్నారని , వారి తప్పేమి లేదని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హక్, జీహెచ్‌ఎంలు నాగ్యానాయక్, చంద్రకళ, కృష్ణయ్య, అనంతప్ప, వనజ, తదితరులు పాల్గొన్నారు.

● స్పౌజ్ పాయింట్ల విషయంలో తప్పుడు అభియోగాలు ఎదుర్కొంటున్న జీహెచ్‌ఎంలపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తి వేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మదన్ మోహన్ యాదవ్, సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎంల సస్పెన్షన్‌ను ఖండిస్తున్నట్లు చెప్పారు.

ప్రజలకు ఇబ్బందులు రానివ్వొద్దు


ట్రాక్టర్‌లో తోపుడు బండ్లు వేస్తున్న సిబ్బంది

బాలానగర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో సంత బజారులో రోడ్లపై తోపుడుబండ్లు ఇష్టానుసారంగా నిలపడంతో బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కార్యదర్శి జగన్ అన్నారు. సంత బజారులో రోడ్డుపై బండ్లను సోమవారం ట్రాక్టర్‌లో తరలించారు. సంత బజారులో తోపుడుబండ్లు నిలపడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటాయని, దీనిని దృష్టిని ఉంచుకొని పంచాయతీ సిబ్బందికి సహకరించాలని వ్యాపారుల్ని కోరారు.